క్లుప్తంగా

నేటి నుంచి గృహజ్యోతి సర్వే

దౌల్తాబాద్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా.. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులను గుర్తించేందుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి సర్వే చేపట్టనున్నారు. గృహ వినియోగ విద్యుత్ మీటర్ ప్రస్తుత బిల్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ అనుసంధానం చేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చాయని, ప్రతి ఒక్కరూ విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ మహిపాల్ కోరారు.

సీఎంను కలిసిన లాల్‌కృష్ణ


సీఎంను కలిసిన బీసీ సంక్షేమ సంఘం నేత

పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎం సూచించినట్లు లాల్‌కృష్ణ పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి, బీసీలకు న్యాయం చేస్తామని, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజారోగ్యంపై ఎంపీ ప్రత్యేక దృష్టి


వైద్య శిబిరంలో పాల్గొన్న జెడ్పీటీసీ హరిప్రియ

పరిగి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని జెడ్పీటీసీ హరిప్రియ అన్నారు. ఎంపీ నిర్వహిస్తున్న ఆరోగ్యరథం కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధి గడిసింగాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఆరోగ్యరథంతో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నిరుపేదలు మెరుగైన వైద్యచికిత్సలకు దూరంగా ఉంటున్నారని, ఎంపీ చేపడుతున్న ఆరోగ్యరథం.. వారికి ఎంతగానో ఉపయోగపడుతోందని వెల్లడించారు. ఇందులో ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని, కావున ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

స్వయం పరిపాలన దినోత్సవం


పాఠం చెబుతున్న విద్యార్థిని

పూడూరు: కడుమూరు ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా.. తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఇందులో ఎంపీటీసీ యాదమ్మ, విద్యావేత్త సుధాకర్‌రెడ్డి, అఫ్జల్, హెచ్‌ఎం మధు, కృష్ణ, ఉపాధ్యాయులు అనూష, హరీశ్, ఖాజామోహినొద్దీన్, శ్రీనివాస్, ఆనంద్, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సురేశ్, నాయకులు ఉన్నారు.

సాగరుల ఐక్యత చాటుదాం

పెద్దేముల్: సాగరుల (ఉప్పరి) కులం ఐక్యతను చాటుదామని సంఘం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు అనంతరాం అన్నారు. మంగళవారం మంబాపూర్ గ్రామంలో మాజీ పాలక సభ్యులు శ్రావణ్‌కుమార్, యాదయ్య, శ్రీనివాస్, నీలమ్మలను సంఘం తరఫున సన్మానించారు. అనంతరం మాట్లాడారు. ఉప్పరి కులం నుంచి సర్పంచ్‌గా శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడిగా శ్రీనివాస్, నలుగురు వార్డు సభ్యులు గెలుపొందారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే.. పోటీ చేస్తామని సంఘం ఉపాధ్యక్షుడు మల్లేశం తెలిపారు. సంఘం మంబాపూర్ అధ్యక్షుడు ఎల్లప్ప, రవిందర్, అశోక్‌బాబు, రెగోండి నర్సింహులు, శాంతుకుమార్ ఉన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

దోమ: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి కోటాజి సూచించారు. మంగళవారం దోమ మండల కేంద్రం స్త్రీశక్తి భవనంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్ సక్రమంగా అందేలా చూడాలని, నాలాలను శుభ్రం చేయిస్తూ.. బ్లీచింగ్ పౌడర్ చల్లించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రైతుచైతన్య సదస్సుల జాడేది?

- కర్షకుల సాగుకు సలహాలు కరువు
- వేదికలకే పరిమితమైన ఏఈఓలు
- వ్యవసాయేతర పనుల్లో అధికారులు బిజీ
- ఎరువుల దుకాణదారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- ఇష్టారీతిన ఎరువుల వాడకం


వరినాట్లు వేస్తున్న రైతులు

పరిగి: రైతులు పండించే పంటలకు.. సాగులో మెళకువలతో పాటు.. సోకిన చీడపీడలను గుర్తించి సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయ విస్తరణ అధికారులు ఇతర పనుల్లో బిజీగా ఉంటున్నారు. రైతులకు అందుబాటులో ఉండాలని ప్రతి క్లస్టర్‌కు ఓ రైతు వేదికను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ అధికారులు మాత్రం ఆ చైతన్య వేదికలకే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అవగాహన లేమితో రైతులు నష్టపోతున్నారు. చేసేది లేక ఫర్టిలైజర్ దుకాణ దారులను ఆశ్రయించి.. వారు సూచించిన ఎరువులను పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ.. ఫలితం లేక.. నష్టపోతున్నారు. రబీలో రైతులు వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలను సాగు చేస్తుంటారు. వాతావరణ సమస్యలతో పంట ఎర్రబారి, ఎదుగుదల తగ్గి, పెట్టిన పెట్టుబడి రాని దుస్థితి నెలకొంది. దీనికి ఆందోళన చెందిన రైతులు.. ఏదో ఒక పురుగు మందులు పిచికారీ చేసి.. పంట నష్టపోయి, పెట్టుబడులు కోల్పోతున్నారు.

యాసంగిలో 50వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గంలోని పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 22 క్లస్టర్లల్లో 22 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. యాసంగిలో 50వేలకు పైగా ఎకరాల్లో రైతులు వరి, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాకు వచ్చారు. అయితే పంట సాగు చేసేముందు, చేసిన తరువాత రైతులకు సాగుపై వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. అంతే కాదు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో తిరిగి రైతుల సమస్యలు, ఏఏ పంటలను సాగు చేశారనే విషయాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి, పంటలకు సోకిన తెగుళ్ల గురించి ఆరా తీయాలి. వ్యాధులు సోకినట్లయితే.. నివారణ చర్యలను సూచించాలి.

నష్టపోతున్నాం..



యాసంగిలో మూడు ఎకరాల్లో వరి వేశాను. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు. దీంతో పంటలకు రోగం వచ్చిందని మందుల దుకాణానికి వెళ్లి, మందులు కొనుక్కుంటున్నాం. పిచికారీ చేస్తున్నాం. నష్టపోతున్నాం. అధికారులు పంటలను పరిశీలించి, రైతుల సమస్యలను పరిష్కరించాలి.

– పోచయ్య, రైతు, ఇప్పాయిపల్లి

త్వరలో అవగాహన కల్పిస్తాం



సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా.. రైతులు రైతు వేదికల్లో ఉన్న పంటల విస్తరణ అధికారులను సంప్రదించాలి. పరిస్థితి వివరించి సలహాలు, సూచనలు తీసుకోవాలి. గ్రామాల్లో ఎలాంటి పంటల గురించి రైతులకు అవగాహన కల్పించడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సదస్సులు ఏర్పాటు చేస్తాం.

– ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పరిగి

వందశాతం ఫలితం రావాల్సిందే

- పదిలో ఉత్తీర్ణత శాతం తగ్గితే ఉపాధ్యాయులపై చర్యలు
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి


ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

మోమిన్‌పేట: పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాల్సిందేనని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో మోమిన్‌పేట, మర్పల్లి, బంటారం, కోటపల్లి మండలాల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పది వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు రాబట్టని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు నడవాలని, అందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అందుకు వారితో సమావేశం నిర్వహించి, పిల్లలను ప్రోత్సహించే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రత్యేక తరగతులు, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల గ్రేడింగులను బట్టి, సెక్షన్లను తయారు చేసుకొని ఆకట్టుకునేలా బోధించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పదిలో తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు కావడానికి వీల్లేదని వెల్లడించారు. మండల విద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు గోపాల్, విద్యాసాగర్, చంద్రప్ప, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ పాఠశాలల ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదవి లేకున్నా.. ప్రజాసేవలో ఉంటాం


మాజీ పాలక సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

యాలాల: పదవి లేకున్నా.. ప్రజాసేవలో ఉంటామని బెన్నూరు మాజీ సర్పంచ్ పటేల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న పాలక సిబ్బందికి జీపీ కార్యదర్శి తారకచారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బండి నర్సమ్మ, మాజీ వార్డు సభ్యులు సురేందర్‌రెడ్డి, మురళీగౌడ్, శ్రీశైలం, గంగమ్మ, లలితమ్మ, లక్ష్మీ, అన్నపూర్ణ, పాల చంద్రమ్మ, కోఆప్షన్ సభ్యులు నారాయణరెడ్డి, శరణుభూపాల్ మాజీ సర్పంచ్‌లు గాళ్ల కృష్ణయ్య, కైలా చంద్రారెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

మీటర్ రీడింగ్ ఉద్యోగుల నిరసన


విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గృహజ్యోతితో పనిభారం పెరుగుతోందంటూ విధుల బహిష్కరణ

తాండూరు టౌన్: గృహజ్యోతి పథకంతో పని భారం పెరుగుతుందని, ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్ మీటర్ రీడింగ్ ప్రైవేటు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మంగళవారం విధులు బహిష్కరించి, తాండూరు విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి ప్రజలకు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయాలని సంకల్పించింది. అయితే ఇంటింటికీ వెళ్లి, మీటర్ రీడింగ్ వివరాలకు అనుబంధంగా యజమాని ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర వివరాలను సేకరించాల్సి ఉంటుంది. అయితే ఈ విధానం వలన తమకు పనిభారం పెరుగుతుందని ఉద్యోగులు పేర్కొన్నారు.

ఎస్‌ఐలకు స్థాన చలనం


చన్గోముల్‌కు మధుసూదన్‌రెడ్డి


ధారూరుకు వేణుగోపాల్‌గౌడ్


పరిగికి సంతోష్‌కుమార్

పరిగి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఎస్‌ఐలు)కు స్థానం కలిగింది. ఇందులో భాగంగా మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పరిగి నూతన ఎస్‌ఐగా ధారూరులో పనిచేస్తున్న సంతోష్ కుమార్‌ని నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సత్యనారాయణ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

బషీరాబాద్‌కు రమేష్..

బషీరాబాద్: వికారాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న వి.రమేష్‌ను ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వేణుగోపాల్‌గౌడ్‌ను ధారూరు పీఎస్‌కు పంపించారు.

చన్గోముల్‌కు మధుసూదన్‌రెడ్డి

పూడూరు: చన్గోముల్ ఎస్‌ఐగా మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. పూడూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న గిరిని పెద్దేముల్‌కు బదిలీ చేశారు. కరణ్‌కోట్ ఎస్‌ఐగా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డిని చన్గోముల్‌కు పంపించారు.

కరన్‌కోట్‌కు.. విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి బదిలీ అయ్యారు. 2021 డిసెంబర్ నుంచి ఇక్కడ పనిచేస్తున్న ఆయనను.. చన్గోముల్‌కు బదిలీ చేశారు. మోమిన్‌పేట్‌లో విధులు నిర్వహిస్తున్న విఠల్‌రెడ్డిని.. కరన్‌కోట్ పీఎస్‌కు బదిలీ చేశారు.

ధారూరుకు వేణుగోపాల్‌గౌడ్

ధారూరు: ధారూరు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పరిగికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బషీరాబాద్ ఎస్ వేణుగోపాల్‌గౌడ్‌ను నియమించారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న సుమన్

- సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- మాజీ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేతల మండిపాటు
- బాల్కసుమన్‌పై చర్యలకు డిమాండ్



పరిగి: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ మతిభ్రమించి మాట్లాడుతన్నాడని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి హెచ్చరించారు. వెంటనే బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పాలాద్రి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

దౌల్తాబాద్: ఓటమితో కుంగిపోయిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఇలా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇక ముందు ఇలా చేస్తే తరిమికొడతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు హెచ్చరించారు. అనంతరం బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, సత్యపాల్, దస్తప్ప, భీంరెడ్డి, మహిపాల్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి బంట్వారం ఠాణాలో ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, నాయకులు పురోషోత్తంరెడ్డి, ఆలంపల్లి శ్రీనివాస్, వెంకటేశం, నర్సింహారెడ్డి, రాములు, ఎల్లయ్య, శంకర్ యాదవ్, గిరిదాస్, యాదగిరి, మున్నాబాయ్, యాకుబ్, ముజీబ్ పాష తదితరులు పాల్గొన్నారు..

నోరు అదుపులో పెట్టుకోవాలి..

కుల్కచర్ల: సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడటమే కాకుండా.. చెప్పును చూపించడం హేయమైన చర్య యని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య ముదిరాజ్ అన్నారు. ప్రజలకు మీ పాలన తీరు నచ్చకే.. కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, అయినా బీఆర్‌ఎస్ నేతలకు బుద్ధిరావటం లేదని మండిపడ్డారు. బాల్కసుమన్ వెంటనే.. సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేసు నమోదు చేయాలి

అనంతగిరి: సీఎంపై మంచిర్యాల సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కౌన్సిలర్లు మురళీ, వేణు, చందర్‌నాయక్, ఎస్సీసెల్ జిల్లా నాయకులు రాజు, పార్టీ మర్పల్లి అధ్యక్షుడు రవీందర్, సీనియర్ నాయకులు ముత్తాహర్ షరీఫ్, జంగయ్య, యాదగిరి, రత్నం, మల్లేశం, రహీం, శ్రీనివాస్ ముదిరాజు, నర్సింహులు, బుచ్చయ్య, లక్ష్మణ్, రవి, ప్రవీణ్, విజయ్, నరేందర్ ఉన్నారు.


దౌల్తాబాద్‌లో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


బంట్వారం: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


వికారాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సంక్షిప్త వార్తలు

• పెరగనున్న వరి సాగు

పెద్దేముల్: మండల పరిధిలో యాసంగి సీజన్‌లో వరి సాగు జోరందుకుంది. గ్రామాల్లో వరికి నేలలు అనుకూలంగా ఉండటంతో రైతులు వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాదిలో సుమారు 3వేల ఎకరాల్లో సాగవగా.. ప్రస్తుత సీజన్‌లో 3500 ఎకరాల్లో సాగవనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలిసింది.

• వేలం వాయిదా..

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, లడ్డు ప్రసాదం, పులిహోర విక్రయానికి మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట వాయిదా పడింది. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 15వరకు జరిగే ఉత్సవంలో భాగంగా ఏడాది పాటు నిర్వహించే దుకాణాల వేలంలో.. వ్యాపారులు గతేడాది కంటే తక్కువగా పాట పాడినందుకు.. కార్యక్రమాన్ని వాయిదా వేశామని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

• రేపు మహాధర్నా

అనంతగిరి: కేరళ ప్రభుత్వంపై, కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా.. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో పార్టీ జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలు పాల్గొనున్నారని పేర్కొన్నారు. జిల్లా నుంచి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

• 'రేషన్' పట్టిక తప్పనిసరి

కుల్కచర్ల: రేషన్ డీలర్లు.. విధిగా తమ దుకాణాల వద్ద ధరలు, సరకుల పట్టికను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరకులు అందించడంలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలిగించరాదని, ఈకేవైసీని ఈ నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని చెప్పారు. ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆశిశ్, గణపతి ఉన్నారు.

• పారిశుద్ధ్యం మెరుగుపడాలి



తాండూరు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో ఎంపీడీఓ మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో కార్యదర్శులే కీలకమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఇందులో ఏపీఓ నరోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

• కష్టపడిన వారికి గుర్తింపు

తాండూరు రూరల్: సాధారణ ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప అన్నారు. మంగళవారం మండల పరిధి చెంగోల్, చెన్‌గేస్‌పూర్, కోనాపూర్, గుంత బాసుపల్లి గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, నాయకులు రాము యాదవ్, సుధాకర్ ఉన్నారు.

• బీసీలకు రాజ్యాధికారం రావాలి

కొడంగల్: రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం రావాలని, పాలనలో భాగస్వాములను చేయాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బురుగుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. 'అడిగితే వచ్చేది శూన్యం.. పోరాడితినే రాజ్యాధికారం' అనే గోడపత్రికను ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీసీ వర్గాలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీసీలు కనీస హక్కులకు నోచుకోవడం, అగ్రవర్ణ రాజకీయ పార్టీల నాయకులు బీసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో 65శాతం ఉన్న బీసీలకు పార్లమెంట్ సీటు కేటాయించాలని కోరారు. న్యాయం చేయని పక్షంలో.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇందులో గౌడుగు నర్సింహులు, గోండ్ల భాస్కర్, నరేష్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

• బాల్‌రెడ్డికి స్టేషన్ బేయిల్


బొంరాస్‌పేట: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, రైతుభరోసా పథకం కింద రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని చెప్పి, ఇంత వరకు వేయలేదని మండల పరిధి కొత్తూరుకు చెందిన రైతు బాల్‌రెడి గతంలో ప్రశ్నించారు. అంతే కాకుండా సామాజిక మాధ్యమం వేదికగా.. అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్‌రెడ్డిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు మంగళవారం బాల్‌రెడ్డిని అరెస్టు చేయగా.. బీఆర్‌ఎస్ నాయకులు స్టేషన్ బెయిల్‌పై రైతును తీసుకెళ్లారు. ఇందులో నరేందరన్న, ప్రజాసేవా సమితి తాలూకా కోశాధికారి మొహ్మద్ వసీం, మండల అధ్యక్షుడు మహ్మద్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శి రామకృష్ణగౌడ్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎఫ్ఎస్ సలాం ఉన్నారు.

'అల్బెండజోల్'తో నులిపురుగుల నివారణ


శిక్షణలో మాట్లాడుతున్న వైద్యాధికారి మాధురి

కుల్కచర్ల: రక్తహీనత నుంచి పిల్లలను రక్షించేందుకు అల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయని మండల వైద్యాధికారి మాధురి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లల ఎదుగుదలకు నులిపురుగులు ఇబ్బందికరంగా మారాయని, ఈ మాత్రల వలన వాటిని నివారించవచ్చని తెలిపారు. ఈ నెల 12 నుంచి చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నామని, అందుకు అవసరమైన కార్యచరణను ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇందులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, లెప్రసి అధికారి హరిత, పీహెచ్‌ఎన్ రత్నలత, వైద్య అధికారులు విజయలక్ష్మి, యాదమ్మ, ఫాతిమా, వెంకటయ్య, అంజు, సిబ్బంది సుజాత, రత్నమ్మ, వెంకటమ్మ, జంగమ్మ, సుజాత, మంగమ్మ, భారతమ్మ, శ్రీలత, జ్యోతి, మైభమ్మ, రమేష్, నవీన్, ప్రశాంత్, శ్రీనివాస్, లింగమ్మ ఉన్నారు.

రిజిస్ట్రేషన్లకు తప్పని పడిగాపులు


రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న రైతులు

స్లాట్ బుక్ చేసుకున్నా.. సాయంత్రం వరకు నిరీక్షించాల్సిందే!

దోమ: భూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వస్తోందని పలువురు రైతులు ఆరోపించారు. స్లాట్ బుక్ చేసుకొని తహసీల్ కార్యాలయానికి వచ్చినా.. ఈ తిప్పలు తప్పడం లేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. వివిధ కారణాల చెప్పి, రిజిస్ట్రేషన్లు చేయకుండా కాలయాపన చేయిస్తున్నారని విమర్శించారు. తిండీతిప్పలు లేకుండా సాయంత్రం వరకు ఉండి, రిజిస్ట్రేషన్ల తరువాత ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. నెల రోజులుగా తహసీల్దార్ ఇలాగే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీసీ జరిగిందని, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించామని, అందువలన రిజిస్ట్రేషన్లు ఆలస్యం అయ్యాయని ఆయన వివరించారు.